## జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ

చెన్నూర్ : కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విజేతలు

చెన్నూర్, డిసెంబర్ 22 : మంచిర్యాలలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో చెన్నూర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ(బాలికల) గురుకుల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ స్రవంతి తెలిపారు. వాలీబాల్ పోటీల్లో అలేఖ్య, రక్షిత, మహేశ్వరీ, నవ్య, సాయితేజ, మీన, అంజలి, హ్యాండ్ బాల్ పోటీల్లో టీ ప్రిన్సీ, ఇంద్రవల్లి, 400 మీటర్ల పరుగు పందెంలో దీపిక, అంజలి విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. ఈ విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, పీఈటీ షాహీన్ సుల్లానా, ఉపాధ్యాయులు అభినందించారు.

### వేమనపల్లి విద్యార్థులు..

వేమనపల్లి, డిసెంబర్ 22 : వేమనపల్లి మండల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు దాసరి మల్లేశ్ తెలిపారు. క్రీడాకారులు 29 పతకాలు సాధించి జిల్లాలోనే మండలాన్ని టాప్‌లో నిలిపారన్నారు. క్రీడాకారులను మాజీ జడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, తహసీల్దార్ రమేశ్, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, సీఐ సుధాకర్, ఎస్ఐ శ్యామ్ పటేల్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అభినందించారు.

వేమనపల్లి : పతకాలు సాధించిన క్రీడాకారులు

# రాంచీలో అట్టహాసంగా కోలిండియా వాలీబాల్ పోటీలు

రాంచీలో సింగరేణి జట్టు క్రీడాకారులు

- రాంచీ వేదికగా 24వ తేదీ వరకు నిర్వహణ
- పాల్గొన్న సింగరేణి జట్టు
- విజయంపై పూర్తి ధీమాగా క్రీడాకారులు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 22 : ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో కోలిండియా వాలీబాల్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 24వ తేదీ వరకు మూడురోజుల పాటు, పోటీలు జరుగనున్నాయి. సింగరేణి జట్టు శనివారం రాంచీ చేరుకున్నది. సింగరేణిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను కోలిండియా జట్టుకు యాజమాన్యం ఎంపిక చేసింది. సంస్థలోని పలు ఏరియాలకు చెందిన 12మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవలే శ్రీరాంపూర్‌లో శిక్షణ శిబిరం నిర్వహించారు. కోలిండియా పోటీల్లో సింగరేణి జట్టు విజయంపై క్రీడాకారులు ధీమాగా ఉన్నారు. తప్పనిసరిగా సత్తా చాటుతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### పోటీలకు ఎంపికైన క్రీడాకారులు..

సింగరేణి సంస్థలోని పలు ఏరియాలకు చెందిన క్రీడాకారులు కోలిండియా వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో బంగోని చిన్నన్న(విజిలెన్స్ డిపార్ట్‌మెంట్, ఎస్టీపీపీ), కే రమేశ్(శ్రీరాంపూర్), నవీన్‌కుమార్(శ్రీరాంపూర్), గుపల రాజు (శ్రీరాంపూర్), నాగరాజు (జయశంకర్ భూపాలపల్లి), గుగ్లోత్ లక్ష్మణ్ (జయశంకర్ భూపాలపల్లి), కొట్టెం సురేశ్(జయశంకర్ భూపాలపల్లి), ఇత్తినేని తిరుపతి(ఆర్జీ-1), ఉల్లెంగుల నరేశ్(ఆర్జీ-2), వంగ రాములు (మందమర్రి), పీ ప్రసాద్(శ్రీరాంపూర్), సింగతి రమేశ్(మందమర్రి) ఉన్నారు. శ్రీరాంపూర్ ఏరియా అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్ టీం మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

### ❖ సింగరేణి సత్తా చాటుతాం..

సింగరేణి నుంచి ఎంపికైన క్రీడాకారులంతా ప్రతిభగల వారే ఉన్నారు. కొందరు కొత్తవారు కాగా, మరికొందరు ఇప్పటికే కోలిండియా పోటీల్లో పాల్గొన్న అనుభవం ఉంది. నేను 25 ఏళ్లుగా కోలిండియా పోటీలతో పాటు, ఆలిండియా పబ్లిక్ సెక్టార్ పోటీల్లో పాల్గొన్న. ఈ సారి కోలిండియా పోటీల్లో బంగారు పతకం సాధిస్తామనే నమ్మకం ఉంది. ఈ దిశగానే ముమ్మర సాధన చేశాం. జట్టు వ్యూహాలు రచించడం జరిగింది. కోలిండియాలో సింగరేణి జట్టు విజయం సాధించి, సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తాం.

- బొంగోని చిన్నన్న, కెప్టెన్, సింగరేణి జట్టు

పిచ్చిమొక్కలతో నిండిపోయిన డంప్‌యార్డు

దహెగాం గ్రామ రోడ్డు సమీపంలో పడేసిన చెత్త

## డంప్‌యార్డు ఒక చోట.. చెత్తవేసేది మరోచోట

దహెగాం, డిసెంబర్ 19 : చెత్తరహిత గ్రామాలుగా నెలకొల్పాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం.. ప్రతి గ్రామపంచాయతీకి ఓ డంప్ యార్డును నిర్మించింది. దీంతో పాటు, వాటి నిర్వహన సక్రమంగా నిర్వహించింది. గ్రామాల్లో చెత్త కనిపించేదికాదు. ప్రస్తుతం డంప్ యార్డుల నిర్వహన సక్రమంగా లేక పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి. దహెగాం పంచాయతీలో డంప్ యార్డులో చెత్త వేయకుండా గ్రామ సమీపంలోని రోడ్డు సమీపంలో చెత్తను పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో చెత్తకుప్పలు పెరుకుపోయి దుర్గంధం వెదచిల్లుతున్నది. అధికారులు చెత్తను డంప్ యార్డుకు తరలించక గ్రామ సమీపంలోనే పడవేస్తుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డంప్ యార్డులో మాత్రం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ విషయమై ఎంపీడీవో రాజేందర్‌ను వివరణ కోరగా, త్వరలోనే డంప్‌యార్డులో చెత్త వేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. డంప్‌యార్డులోని పిచ్చిమొక్కలను తొలగిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం వేసిన చెత్తను తొలగిస్తామని చెప్పారు.

## సర్వే వేగంగా పూర్తిచేయాలి

తాండూర్, డిసెంబర్ 22 : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఎంపీవో అనిల్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. తాండూర్‌తో పాటు, పలు గ్రామాల్లో సర్వేను ఆదివారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒక్క దరఖాస్తునూ వదలవద్దని ఆదేశించారు. కార్యదర్శి దివాకర్, సిబ్బంది ఉన్నారు.

## పేరుకు 300 ఫీట్లు.. వేసింది 200

- చేతి పంపుల ఏర్పాటులో రిగ్గు యజమాని చెప్పిందే వేదం!

దసిలికుంట ముందు వేసిన బోరు

నెన్నెల, డిసెంబర్ 22 : చేతి పంపుల ఏర్పాటులో రిగ్గు యజమాని చెప్పిందే వేదమవుతున్నది. వారు ఎంత చెప్పితే అంతకే అధికారులు బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల నెన్నెల మండలంలోని పలు గ్రామాల్లో పదుల కొద్దీ చేతి పంపులు వేయిస్తున్నారు. ఒకటి రెండు చేతి పంపుల విషయంలో వారి భండారం భయటపడ్డట్లయ్యింది. నెన్నెలలోని దసిలికుంట సమీపంలో వేసిన బోరే ఇందుకు నిదర్శనం. అక్కడ బోరును రూ.2.80 లక్షలతో మూడు వందల ఫీట్లు రిగ్గు వేసి పూల్ కేసింగ్ వేయాల్సి ఉంది. కానీ రిగ్గు కేవలం 280 ఫీట్ల వరకు వేశారు. అనంతరం అంత మొత్తంలోనే కేసింగ్ వేయాల్సి ఉంది. కానీ, కేవలం మూడు కేసింగ్ పైపులను ఫిట్ చేసి, చేతులు దులుపుకున్నారు. ఇదేందని అక్కడి ప్రజలు రిగ్గు లేబర్‌ను ప్రశ్నిస్తే ఇంతే వేస్తారు అని ఒకసారి.., లేదు పది పైపులు వేశామని మరోసారి చెప్పి తప్పించుకుపోయారు. కేవలం మూడు పైపులు మాత్రమే వేశారని, పూర్తి స్థాయిలో కేసింగ్ వేయలేదని ఆ వాడలోని పలువురు యువకులు ప్రశ్నిస్తే ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇలా పలు చోట్ల వేసిన బోరు బావుల్లో రిగ్గు యాజమానులు ఇష్టారీతిన వ్యవహరించారని పలువురు అంటున్నారు. బోర్లు వేసే ముందు సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు, సిబ్బంది ఎవరూ పర్యవేక్షించకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



నియామక పత్రం అందజేస్తున్న మండలాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు

## బీఆర్ఎస్వీ తాండూర్ మండల ఉపాధ్యక్షుడిగా మీర్ ముష్ఫిక్ అలీ

తాండూర్, డిసెంబర్ 22 : బీఆర్ఎస్వీ తాండూర్ మండల ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి మీర్ ముష్ఫిక్ అలీ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం తాండూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశాల మేరకు టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్, పార్టీ మండలాధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి సహకారంతో బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు దోంగ్రి శ్రీకాంత్ నియామక పత్రాన్ని అందించారు. పార్టీ పటిష్టానికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ముష్ఫిక్ అలీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు దత్తాత్రేయరావు, పెరుక రాజన్న, ఎలుక రాంచందర్, ఉప్పుట్ల సంతోష్, బండి సత్యనారాయణ, గాజుల రమేశ్, సారయ్య, ముహ, లతీఫ్, షారూక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సభ్యత్వం అందజేస్తున్న టీఎన్జీవో జిల్లా నాయకులు

## 100 మంది ఉద్యోగులకు టీఎన్జీవో సభ్యత్వ నమోదు

హాజీపూర్, డిసెంబర్ 22 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో సభ్యత్వ నమోదును ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో వీఆర్ఏలుగా పనిచేస్తూ వివిధ ప్రభుత్వ శాఖల్లో రికార్డు, జూనియర్ అస్టిటెంట్లుగా ప్రమోషన్ పొందిన దాదాపు 100 మంది ఉద్యోగులకు ఆదివారం సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గతంలో వీఆర్ఏగా విధులను నిర్వహించిన వారికి ప్రమోషన్లు వచ్చేందుకు టీఎన్జీవో నిరంతరం కృషి చేసిందన్నారు. ఆఖరకు విజయం సాధించిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు ఎదురైనా రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి ఏ సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బొడ్డు రామ్‌కుమార్, తిరుపతి, అంజయ్య, సంయుక్త కార్యదర్శులు సునీత, ప్రభు, కార్యదర్శి శ్రావణ్ కుమార్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలుపోతున్నా పట్టించుకోరా?

ఇందారం వద్ద రోడ్‌వేస్ మేనేజర్‌కు సూచనలు చేస్తున్న సీఐ వేణుచందర్

- హెచ్‌కేఆర్ రోడ్‌వేస్ మేనేజర్‌పై సీఐ వేణుచందర్ ఆగ్రహం

జైపూర్, డిసెంబర్ 22 : రోడ్డు ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అంటూ హెచ్‌కేఆర్ రోడ్‌వేస్ మేనేజర్‌పై శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఇందారం బస్టాండ్ వద్ద శుక్రవారం రాత్రి బైక్ ఢీకొని రిటైర్డు కార్మికుడు సుంకరి మల్లయ్య మృతి చెందగా, ప్రమాదానికి కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. ప్రమాద స్థలాన్ని ఆదివారం సీఐ పరిశీలించారు. సెంట్రల్ లైటింగ్ ఉండి కూడా పవర్ కనక్షన్ ఇవ్వకపోవడంతో రాత్రి అనేక ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. బస్టాండ్ వద్ద పశువులు రోడ్ల మీద ఉండడంతో కూడా ప్రమాదాలు జరుతున్నట్లు స్థానికులు ఆయనకు తెలిపారు. బస్టాండ్ వద్ద లైటింగ్‌తో పాటు, స్పీడ్ బ్రేకర్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికి ఈ ప్రదేశంలో జరిగిన ప్రమాదాలతో పది మంది వరకు ప్రాణాలు పోగొట్టుకున్నట్లు వివరించారు. హెచ్‌కేఆర్ రోడ్ వేస్ మేనేజర్ రామకృష్ణను పిలిపించి మాట్లాడారు. వారంలోగా సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనక్షన్ ఇచ్చి, లైట్లు ఆన్ చేయాలని ఆదేశించారు. లేకపోతే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. సెంట్రల్ లైటింగ్‌తో పాటు, సర్వీస్ రోడ్డు సైడ్ రేయిల్స్ కూడా బాగుచేయాలని సూచించారు. ఎస్ఐలు శ్రీధర్, నాగరాజు తదితరులున్నారు.

## ఉత్తమ అధికారులు, ఉద్యోగుల ఎంపిక

రెబ్బెన, డిసెంబర్ 22 : సింగరేణి ఆవిర్భావ వేడుకల సందర్భంగా బెల్లంపల్లి ఏరియాలో ఉత్తమ అధికారులు, ఉత్తమ ఉద్యోగులను ఎంపికచేసినట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే వేడుకల్లో జీఎం చేతుల మీదుగా సన్మానించనున్నట్లు పేర్కొనారు. బెల్లంపల్లి ఏరియా ఉత్తమ అధికారులుగా నాగుల వేణు(డీవైపీఎం-ఖైర్‌గూడ ఓసీపీ), పీ శ్రావణ్‌కుమార్(ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఅండ్ఎం) గోలేటి సీహెచ్‌పీ), ఉత్తమ ఉద్యోగులుగా ఎండీ అబ్దుల్ సమద్ (హెడ్ ఓవర్‌మన్-ఖైర్‌గూడ ఓసీపీ), సురేశ్‌కోరి(కన్వేయర్ ఆపరేటర్-గోలేటి సీహెచ్‌పీ) ఎంపికైనట్లు తెలిపారు.

నాగుల వేణు

శ్రావణ్‌కుమార్

అబ్దుల్ సమద్

సురేశ్‌కోరి

## గంజాయి పట్టివేత

కోటపల్లి, డిసెంబర్ 22 : కోటపల్లి మండలం పారుపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న తనిఖీల్లో ఆదివారం 1550 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. కొల్లూరు గ్రామానికి చెందిన యువకుడు ఆలం పున్నం పోలీసుల తనిఖీని గమనించి, పారిపోతుండగా, పట్టుకున్నాడు. అతని వద్ద తనిఖీ చేయగా, గంజాయి లభించింది. కొల్లూరులో గంజాయి సాగు చేస్తూ చెన్నూర్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నట్లు వెల్లడయ్యింది. పట్టుకున్న గంజాయి విలువ రూ.28 వేల వరకు ఉంటుందని, పున్నంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వివరించారు.

## అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి

చెన్నూర్, డిసెంబర్ 22 : పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి మండలి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు సామల ఉమారాణి డిమాండ్ చేశారు. చెన్నూర్ పట్టణంలోని పద్మనగర్ కాలనీలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపి, అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేద్కర్‌ను ప్రపంచ మేధావిగా గుర్తించిన రోజుల్లో మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడడం చాలా బాధాకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కరీంబీ, యామిని, మౌనిక ఉన్నారు.

## కమ్యూనిటీ భవనం నిర్మించాలి

కాగజ్‌నగర్, డిసెంబర్ 22 : ఆర్మీ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోసం కమ్యూనిటీ భవనం నిర్మించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. ఈజ్‌గాంలో ఆదివారం ఆర్మీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం కార్యక్రమానికి, గణతంత్ర వేడుకలు, తదితర అవసరాలకు కమ్యూనిటీ భవనం లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గతంలో జిల్లా అధికారులకు పలుమార్లు వినతిపత్రం అందించినా ఫలితం లేదన్నారు. కాగజ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ కేటాయించడం లేదని, కబ్జాకు గురవుతున్నాయని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి కమ్యూనిటీ భవనం నిర్మించాలని, అందులో యువతకు ఉచిత ఆర్మీ, పోలీసు ఉద్యోగాలకు కావాల్సిన శిక్షణ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

## నేడు పత్తి కొనుగోళ్లు బంద్

జైనూర్, డిసెంబర్ 22 : సీసీఐ పత్తి కొనుగోళ్లను సోమవారం నిలిపివేస్తున్నట్లు జైనూర్ మార్కెట్ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నింగ్ మిల్లులో నిల్వ పెరగడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు, తిరిగి ప్రారంభించే తేదీ త్వరలోనే తెలుపనున్నట్లు పేర్కొన్నారు. రైతులు గమనించాలని కోరారు.

## రాష్ట్ర గెజిటెడ్ హెచ్ఎంల సంఘంలో చోటు

కాగజ్‌నగర్, డిసెంబర్ 22 : తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యవర్గంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఎంఈవో వాసాల ప్రభాకర్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సుభాష్, రాష్ట్ర అధ్యక్షుడు గంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జైనూర్, డిసెంబర్ 22 : రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జైనూర్ ఎంఈవో జాధవ్ మధూకర్‌ను నియమించినట్లు ఎంపీడీవో మధూకర్ తెలిపారు. రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ గంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సుభాష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం నుంచి రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

దండేపల్లి, డిసెంబర్ 22 : దండేపల్లి మండల కేంద్రానికి చెందిన అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చెరుకుల పద్మ-భూమేశ్ కూతురు రక్షిత వివాహానికి ఆదివారం రూ.20వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు చెన్నవేని భానుప్రసాద్, సభ్యులు బుర్ర శ్రీనివాస్, అల్లంల కుమారస్వామి, అరిగెల సుధాకర్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి గణిత పరీక్షలో ప్రతిభ

రాష్ట్రస్థాయిలో రెండోర్యాంక్ సాధించిన నల్ల చరణ్

నస్పూర్, డిసెంబర్ 22 : రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పోటీల్లో మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థి నల్ల చరణ్ రెండోర్యాంక్ సాధించాడు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా, ప్రతిభ చూపాడు. ప్రిన్సిపాల్ ముత్యం వెంకన్న, గణిత ఉపాధ్యాయులు హరీశ్, శ్రీలత, ధనలక్ష్మి, అభినందించారు.

## దుప్పట్ల పంపిణీ

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ రమేశ్, ఎస్ఐ మధూకర్

కౌటాల, డిసెంబర్ 22 : తాటిపల్లి, కనికి, హెట్టి గ్రామాల్లోని 300 మంది పేదలకు కౌటాల పోలీసులు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సీఐ రమేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిషేదిత దందాలు, పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా ఫోన్‌లు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఆయన వెంట ఎస్ఐ మధూకర్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
వర్తుల్: 91827 77671, 91827 77677